# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ప్రాజెక్టు 2027 మార్చి నాటికి పూర్తవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఉద్యాన పంటల సాగుతో భూసారాన్ని పెంచడంతో పాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- ❖ రాష్ట్రంలో ఈ ఏడాది 3,380 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టామని మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి వెల్లడించారు.
- ❖ విశాఖపట్నం రాష్ట్ర ఆర్థిక రాజధానిగా రూపుదిద్దుకుంటోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు.
- ❖ మిర్చి ధరల స్థిరీకరణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

========================

పోలవరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సందర్శించారు. ముందుగా విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. ఆ తరువాత ప్రాజెక్ట్ నిర్మాణంలోని కీలకమైన కాఫర్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, 2 పనుల పురోగతిపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సైట్‌లో ఉన్న కాన్ఫరెన్స్ హాల్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… ప్రాజెక్టు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. వచ్చే ఫిబ్రవరి 15 నాటికి డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పోలవరం మెయిన్ డ్యాం నిర్మాణం దాదాపు పూర్తి అయిందన్నారు. పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను 12 నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు. పోలవరం కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి విశాఖపట్టణం వరకు పోలవరం నీళ్లను తీసుకెళ్తామన్నారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు వెల్లడిస్తూ…

(వాయిస్ 34 సెకన్లు)

అనంతరం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుండి ముఖ్యమంత్రి ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీలో కేంద్ర హోం మంతి అమిత్ షాతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

========================

భూసారాన్ని రక్షించుకుంటూ.. రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచడంతో పాటు వాతావరణాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 50 శాతం గ్రీన్ కవర్ ప్రణాళికలపై అటవీ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధన అంశాలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలు అటవీ శాఖతో సమన్వయంతో ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గ్రీన్ కవర్ ఏర్పాటులో ఉద్యానవన శాఖ పాత్ర కీలకమని ఉద్యాన పంటల సాగులో వైవిధ్యం తీసుకురావడం ద్వారా అటు రైతుకీ, ఇటు భూమికీ ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

========================

విశాఖపట్నం రాష్ట్ర ఆర్థిక రాజధానిగా రూపుదిద్దుకుంటోందని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఈ మేరకు విశాఖపట్టణానికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. పరువు నష్టం కేసు నిమిత్తం ఈరోజు విశాఖ జిల్లా న్యాయస్థానానికి హాజరయ్యేందుకు మంత్రి నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా న్యాయస్థానం వెలుపల విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకూ పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్రంలో పెట్టుబడులు ఇంకా పెరగాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలని అన్నారు. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

========================

రాష్ట్రంలో ఈ ఏడాది 3,380 కోట్ల రూపాయల వ్యయంతో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి వెల్లడించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఈరోజు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మచిలీపట్నం ఓడరేవు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పనులు, రహదారులు భవనాల శాఖ పురోగతిపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తద్వారా రాష్ట్రానికి పలు పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు రావడానికి మార్గం సుగమం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,081 కోట్ల రూపాయల వ్యయంతో 16 వేల కిలోమీటర్ల మేరకు రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చే కార్యక్రమం పూర్తి చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒకే సంవత్సరం 3,380 కోట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపట్టామని, ఇందుకోసం టెండర్లు ఇప్పటికే పిలిచామని, కొన్ని ఒప్పందాలు జరుగుతున్నాయని చెప్పారు. మరికొన్ని పనులు మొదలయ్యాయనీ చెబుతూ వచ్చే మే నెల ఆఖరిలోగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు.

========================

మిర్చి ధరల విషయంలో గతేడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో.. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి సమీక్ష సమావేశం నిర్వహించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గుంటూరులోని వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయంలో మిర్చి ధరలపై నిర్వహించిన సమావేశంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ఈ ఏడాది మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని చెప్పారు. గతేడాది ధరలు అధికంగా ఉండటంతో రైతులు ఎక్కువగా మిర్చి సాగు చేశారని, దాని ప్రభావంతో మార్కెట్‌లో సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు. గత ఏడాది క్వింటాల్ కు 11,750 రూపాయల మద్దతు ధర ఉందని, ఈ ఏడాది 44 శాతం వరకు ఉత్పాదకత తగ్గిందన్నారు. ఈ ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉంచిన మిర్చికి రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

(వాయిస్ 27 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంగా సహకార, ఫలితాల ఆధారిత పాలనలో ప్రగతి (ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్) ఒక కీలక మైలురాయిగా నిలిచింది. మెరుగైన ప్రభుత్వ పాలన, సకాలంలో సంస్కరణల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రగతి కార్యక్రమం 50వ సమావేశం ఇటీవల విజయవంతంగా పూర్తి చేసుకుంది. కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలో ప్రగతి సహాయపడుతోంది. ఇందులో భాగంగా భూ సేకరణ, పాలనా పరమైన అనుమతుల కారణంగా ఆలస్యమైన హిమాచల్ ప్రదేశ్‌లోని పర్బతి-II జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం ప్రగతి సమీక్షతో వేగమవంతమయ్యింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురైన సవాళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2016 ఫిబ్రవరి 17న ప్రగతి సమావేశంలో సమీక్షించి ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.

========================

రాజధాని అమరావతి ప్రాంతంలో తొలిసారిగా ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక ఏర్పాట్లపై ఆయన అధికారులతో ఈరోజు సమీక్షించారు.

========================
========================